# ‘సెమిస్టర్’కు కనీస హాజరు ఉండాల్సిందే!

- పరీక్షలకు సంబంధించిన నిబంధన సరైందే
- బీటెక్‌పై హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ




అమరావతి, జూలై 12(ఆంధ్ర జ్యోతి): బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీస హాజరుశాతం తప్పనిసరని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి జేఎన్‌టీయూ కాకినాడ, జీఎంఆర్‌ఐటీ రూపొందించిన నిబంధనలను సమర్థించింది. కనీస హాజరు నిబంధన సహేతుకం కాదని, ఏకపక్షం అంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు చట్టం ముందు నిలబడవని పేర్కొంది. సింగిల్ జడ్జి తీర్పులోని ఈ భాగాన్ని రద్దు చేసింది. అయితే, ప్రస్తుత కేసులో కోర్టు ఆదేశాల మేరకు విద్యార్థి కౌశిక్ తన 4, 5వ సెమిస్టర్‌ను కొనసాగించారని గుర్తు చేసింది. కౌశిక్ 4, 5 సెమిస్టర్లను రద్దు చేసి, తిరిగి ఆయనను 3వ సెమిస్టర్‌కు పంపించడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఇలా చేయడం వల్ల కౌశిక్ అకడమిక్ ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొంది. జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అకడమిక్ రెగ్యులేషన్ 9(ఐ)(జే) ప్రకారం మేకప్ క్లాస్‌లకు హాజరుకావడం ద్వారా తగిన హాజరుశాతం సాధిస్తే పరీక్ష రాసేందుకు అర్హత సాధించవచ్చని గుర్తు చేసింది. హాజరులోపాన్ని సరిదిద్దుకునేందుకు వీలుగా మేకప్ క్లాస్‌లకు హాజరయ్యేందుకు కౌశిక్‌ను అనుమతించింది. ఈ తీర్పుని ప్రత్యేక పరిస్థితుల్లో ఇస్తున్నామని, భవిష్యత్తులో ఈ ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పషం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్‌లో బీటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) అభ్యసిస్తున్న బీవీకే కౌశిక్ అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేక పోయాడు. హాజరుశాతం 65% కన్నా తక్కువగా ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యం ఆయనను మూడవ సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో కౌశిక్ హైకోర్టును ఆశ్రయించగా, పరీక్షలు రాసేందుకు అనుమతించిన కళాశాల యాజమాన్యం, ఫలితాలు మాత్రం వెల్లడించలేదు. దీంతో మూడవ సెమిస్టర్ ఫలితాలు వెల్లడించడంతో పాటు నాలుగవ సెమిస్టర్ క్లాసులకు హాజరయ్యేందుకు అనుమతించేలా కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ కౌశిక్ మరో పిటిషన్ దాఖలు చేశారు.

ఈనాడు
epaper.eenadu.net

# కనీస హాజరు నిబంధన సరైనదే

## హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**ఈనాడు, అమరావతి:** బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు కనీస హాజరు శాతం ఉండాల్సిందేనన్న నిబంధనలను హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. కనీస హాజరు విషయంలో జేఎన్‌టీయూ-కాకినాడ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాంలోని జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జీఎంఆర్‌ఐటీ) ఇంజినీరింగ్ కళాశాల తీసుకొచ్చిన నిబంధనలు సహేతుకంగా లేవని, ఏకపక్షమంటూ హైకోర్టు సింగిల్ జడ్జి పేర్కొనడం చట్టం ముందు నిలబడదని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి తీర్పులోని ఆ భాగాన్ని రద్దు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.



✦ జీఎంఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కౌషిక్ బీటెక్ చదువుతున్నారు. అనారోగ్యం వల్ల గతేడాది ఆగస్టు, అక్టోబరులో కొన్ని రోజులు తరగతులకు హాజరుకాలేదు. 65 శాతం కన్నా హాజరు తక్కువ ఉందని మూడో సెమిస్టర్ పరీక్ష రాసేందుకు కళాశాల అనుమతించలేదని ఆ విద్యార్థి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం పరీక్ష రాయడానికి అనుమతిచ్చింది. కౌషిక్ మరో వ్యాజ్యం వేస్తూ ఫలితాలు వెల్లడించేలా ఆదేశించాలని, నాలుగో సెమిస్టర్ తరగతులకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. వీటిపై హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపారు. ‘అనారోగ్యానికి ఎప్పుడు గురవుతామనేది మనిషి చేతుల్లో లేని వ్యవహారం. రోగాల కారణంగా కొన్నిసార్లు సాధారణ పనులు చేసుకునేందుకు వీలుండదు. మానవ నియంత్రణలో లేని ఇలాంటి విషయాల్లో.. అనారోగ్యం పాలైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు లేకపోతే పరీక్షలు రాయడానికి అనర్హులవుతారనే నిర్దిష్ట నిబంధన పెట్టడానికి వీల్లేదు. ఇలాంటి నిబంధన సహేతుకం కాదు.. ఏకపక్షం’ అని పేర్కొన్నారు. ఆ విద్యార్థి ఫలితాలు ప్రకటించాలని, తరగతులకు అనుమతించాలని కళాశాలను ఆదేశించారు.

✦ సింగిల్ జడ్జి తీర్పుపై జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపించారు. కనీస హాజరు లేని విద్యార్థులను పరీక్షలు రాసేందుకు అనుమతించడం చట్ట నిబంధనలకు విరుద్ధం అన్నారు. అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. జీఎంఆర్‌ఐటీ నిబంధనలను అనుసరించి తగ్గిన హాజరు శాతాన్ని పెంచుకునేందుకు అదనపు తరగతులకు హాజరయ్యే వెసులుబాటును కౌషిక్‌కు ఇచ్చింది. ఈ తీర్పులో తామిచ్చిన ఉత్తర్వులను భవిష్యత్తులో ఇతరులు ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టంచేసింది.

Date : 13/07/2025 EditionName : ANDHRA PRADESH PageNo : 25